రామారావుకు బంగారు పతకం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నెల్లూరులో జరిగిన 41వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గొల్లపల్లి రామారావు బంగారు పతకం సాధించారు. ఐదు కిలోమీటర్ల విభాగపు పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఆయన కొల్‌కత్తాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన రామారావును పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గోల్డ్ మెడల్ పొందిన రామారావు

పందేలకు సన్నద్ధం..!

సంక్రాంతికి పందెంరాయుళ్లు సిద్ధం

కోళ్లకు తర్ఫీదులో నిమగ్నం

గతేడాది పండుగ మూడు రోజుల్లో రూ.200 కోట్లకుపైనే బెట్టింగ్

పలు గ్రామాల్లో ఇప్పటి నుంచే మొదలైన పందేల జోరు..

పట్టని పోలీసులు

పందేలకు అడ్డుకట్టపై ప్రభుత్వం మౌనం

లెక్కల కోసమే బైండోవర్ కేసుల నమోదు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సంక్రాంతి దగ్గర పడుతుండటంతో పందెంరాయుళ్లు కోడి పందేలకు సన్నద్ధమవుతున్నారు. పందెం పుంజులకు ఇప్పటి నుంచే జీడిపప్పు, పిస్తా, జొన్నలు, గంట్లు వంటి పౌష్టికాహారం అందించడంతోపాటు ఈత కొట్టిస్తూ పందేలకు సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ట్రయల్ రన్ తరహాలో ఇప్పటి నుంచే రెండు జిల్లాలవ్యాప్తంగా పలు గ్రామాల్లో కోడిపందేలు సాగుతున్నా పోలీసులు పెద్దగా పట్టించుకోని పరిస్థితి ఉంది. కోడి పందేలకు అడ్డుకట్ట వేయాలని జనం, సామాజికవేత్తలు మొర పెట్టుకుంటున్నా, కోర్టులు తీర్పులిచ్చినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతియేటా సంక్రాంతి పండుగ మూడు రోజులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగా కోడిపందేలకు అనుమతులిచ్చేస్తున్నారు. కోర్టులకు లెక్కలు చూపించుకునేందుకు మాత్రం బరులను ధ్వంసం చేసి, బైండోవర్ కేసులు నమోదు చేసి పోలీసులు హడావుడి చేస్తున్నారు. గతేడాది సంక్రాంతి పండుగ మూడు రోజులు పందేలకు అనుమతివ్వడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 400 బరుల్లో కోడి పందేలు సాగాయి. బెట్టింగుల రగావంలో

రూ.200 కోట్లకుపైగా చేతులు మారినట్లు అంచనా. పండుగ మూడు రోజులు రాత్రీ పగలు తేడా లేకుండా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పందేల జోరు సాగింది. బరుల ప్రాంతాలన్నీ జాతరను తలపించాయి. పలుచోట్ల తాజా, మాజీ ఎంఎల్ఎలే దగ్గరుండి పందేలను ప్రారంభించడం గమనార్హం. పందేలతోపాటు మూడుముక్కలాట, గుండాటకు సైతం అనుమతులివ్వడంతో పందేలు చూసేందుకు వెళ్లిన యువత వాటికి ఆకర్షితులై జేబులు గుల్ల చేసుకుంటున్న పరిస్థితి ఉంది. అయినప్పటికీ మూడు రోజులు పోలీసులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. ఈ ఏడాది కూడా అదే తరహాలో పందేలు సాగించాలని బరుల నిర్వాహకులు ఇప్పటి నుంచే ఏర్పాట్లపై ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఎవరికి ఎంత మామూళ్లు ఇవ్వాలి, ఎంతమంది వస్తారు, ఏర్పాట్లు ఏవిధంగా చేయాలనే అంశాలపై చర్చలు సైతం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే పందేలరాయుళ్లకు ఇప్పటి నుంచే హోటళ్లలో గదులు బుక్ చేస్తున్నట్లు సమాచారం.

ప్రతియేటా బరులు ధ్వంసం చేస్తున్నట్లు, వేల సంఖ్యలో బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నా పందేలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. కోర్టు ఆదేశాలను అమలు చేసి పందేలకు అడ్డుకట్ట వేయాలని జంతుప్రేమికులు, సామాజికవేత్తలు, జనం కోరుతున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా పందేలకు అడ్డుకట్ట వేయాలని అంతా కోరుతున్నారు.

రాజకీయ నాయకుల కనుసన్నల్లో కోడి పందేలు

సంక్రాంతి పండుగకు ముందు నుంచే గ్రామాల్లో పందేల జోరు మొదలవుతోంది. గతంలో వీటిని అడ్డుకునేందుకు పోలీసులు దాడులు నిర్వహించేవారు. కొంతకాలంగా కోడిపందేలపై దాడులు తగ్గిపోయినట్లు చర్చ సాగుతోంది. దీనికి ప్రధాన కారణం రాజకీయ నాయకుల జోక్యమేనని చెప్పొచ్చు. ఎంఎల్ఎల ఇచ్చిన లేఖల ఆధారంగా ఎస్ఐల నియామకం సాగుతోంది. దీంతో ఎంఎల్ఎలు, వారి అనుచరులు చెప్పిన విధంగా పోలీసులు నడుచుకుంటున్న పరిస్థితి కన్పిస్తోంది. ఎక్కడైనా పందేలు జరుగుతున్నట్లు సమాచారం అంది పోలీసులు వెళ్లినా వాళ్లు మన పార్టీ కార్యకర్తలే పట్టించుకోవద్దని రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు వచ్చేస్తున్నాయి. దీంతో పోలీసులు దాడులు చేయడం పూర్తిగా తగ్గించేశారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పందేలపై దాడులు పెద్దగా లేకుండాపోయాయని బహిరంగంగానే చర్చ సాగుతోంది. పోలీసుల దాడులు తగ్గిపోవడంతో పందెంరాయుళ్లు రెచ్చిపోతున్నారు. దీంతో పండుగ మూడు రోజులే కాకుండా ఇప్పటి నుంచే గ్రామాల్లో పందేల జోరు సాగనుంది.

చాటపర్రులో పిహెచ్‌సిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

గుడ్ల పంపిణీలో అవకతవకలుంటే చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులకు అందజేస్తున్న కోడిగుడ్ల పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. శుక్రవారం బగ్గయ్యపేట అంగన్వాడీ కేంద్రం, చాటపర్రు పిహెచ్‌సి, మాదేపల్లిలోని లింగారావుగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బగ్గయ్యపేట అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణి గంజి విశ్రాంతికి రెండు వారాల నుండి కోడిగుడ్లు అందజేయకపోవడంపై అంగన్‌వాడీ కార్యకర్తలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గర్భిణిని పిలిపించి కోడిగుడ్ల ట్రేలను అందించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించే దిశలో నాణ్యమైన కోడిగుడ్లు అందజేయాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీ కార్యకర్తను హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రం హాజరు రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం చాటపర్రులోని పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది హాజరుకు సంబంధించిన ఎఫ్ఆర్ఎస్ రిపోర్టును అడగ్గా దాన్ని సిబ్బంది చూపకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వస్తున్న ఔట్‌పేషెంట్లకు అందిస్తున్న వైద్య సదుపాయాలు, మందుల లభ్యత, ఆరోగ్యకేంద్రంలో మౌలిక వసతులు, తాగునీటి లభ్యత, ఆసుపత్రి పరిశుభ్రత తనిఖీ చేశారు. లింగారావుగూడెంలోని కనకదుర్గా రైస్‌మిల్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎగుమతులు, దిగుమతులు, స్టాక్ రిజిస్టర్, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం, గోనె సంచులు, తేమశాతం యంత్రం పరిశీలించారు. కలెక్టర్ వెంట డాక్టర్లు, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో కలెక్టర్ తనిఖీలు

ఏలూరు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా జాయింట్ కలెక్టర్

సెలవులోకి కమిషనర్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

ఏలూరు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కమిషనర్ షేక్ షాహిద్ మెడికల్ లీవులోకి వెళ్లినట్లు తెలిసింది. ఇటీవల కార్పొరేషన్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, కమిషనర్‌పైనే విమర్శలు వెల్లువెత్తడంతో ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం.

నేటి నుంచి రీసర్వేలో సమస్యల గుర్తింపు

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని 10 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 17వ తేదీ నుంచి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో సమస్యల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ షంషుద్దీన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ (ఎఫ్-పిఒఎల్ఆర్) కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి నియమితులైన కోర్ కమిటీ సభ్యులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం స్థానికంగా నిర్వహించారు. షంషుద్దీన్ మాట్లాడుతూ విఆర్ఒ ఆధ్వర్యంలో ఇతర శాఖలకు చెందిన అయిదు లేదా ఆరుగురు సిబ్బంది గ్రామ కోర్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారన్నారు. డ్రోన్ ఆధారంగా భూముల విస్తీర్ణం ఖరారు చేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో ఆ మేరకు పరిశీలనా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముందు క్షేత్రస్థాయిలో రైతులు, ఇతరులు లేవనెత్తే సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కోర్ కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఆ తర్వాతే రీసర్వే చేపడతారని తెలిపారు. ఏలూరు రెవెన్యూ డివిజన్‌లో పైలెట్ గ్రామంగా ఎంపికైన కోడూరుపాడు రెవెన్యూ గ్రామంలో రీసర్వే కార్యక్రమం ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ సర్వే కార్యక్రమం పేర ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాఘవన్, మండల సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణ్‌కుమారి, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షులు కెడివి.ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ షంషుద్దీన్

పరిశ్రమల్లో విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏసుదాసు

ప్రజాశక్తి - ఉంగుటూరు

భారీ పరిశ్రమల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేందుకు అవసరమైన పద్ధతులను పాటించాలని పరిశ్రమల కేంద్రం జిల్లా జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని నల్లమాడులో రుద్రా టెక్నోఫీడ్స్, నారాయణపురంలో ఫ్రిజమ్ జాన్సన్ లిమిటెడ్ పరిశ్రమలను సందర్శించారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో అధిక విద్యుత్‌ను వినియోగించే పరిశ్రమలను సందర్శించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ హైరేటింగ్, లోరేటింగ్ మోటార్లకు వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్‌లను వినియోగిస్తే విద్యుత్‌ను మూడోవంతు ఆదా చేసుకోవచ్చన్నారు. ఫ్లోరసెంట్, ఇన్‌కాండిసెంట్ స్థానంలో ఎల్ఇడి లైట్లు వినియోగించి విద్యుత్‌ను ఆదాయ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ నాగేంద్ర భూపాల్, ఫ్రిజమ్ జాన్సన్ హెచ్ఆర్ మేనేజర్ టి.ఈశ్వర్, రుద్రా టెక్నో ఎజిఎం ఎ.కృష్ణారెడ్డి, ఎలక్ట్రికల్ ఇంజినీర్ టి.రాజేష్, ఎ.చంద్రశేఖర్, పి.రాజేష్ పాల్గొన్నారు.

యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏసుదాసు

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికుల సమావేశం జి.వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ జనవరి రెండో తేదీన భారీ ర్యాలీ నిర్వహిస్తారన్నారు. అనంతరం నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా పి.సూర్యారావు, అధ్యక్షులుగా బర్రె బాలరాజు, కార్యదర్శిగా గున్నూరి లక్ష్మణ్, మరో 13 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పెంటయ్య, వై.సత్యవతి, తులసి, వేల్పుల రాజు పాల్గొన్నారు.


నినదిస్తున్న సిఐటియు నేతలు, పారిశుధ్య కార్మికులు

విద్యార్థినుల వసతులు మెరుగుపడాలి

ఎంపిడిఒ రాఘవన్

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల కోసం ప్రత్యేకించిన కొన్ని కనీస సౌకర్యాల కల్పనలో మెరుగుపడాల్సి ఉందని ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన భీమడోలు హైస్కూల్‌ను శుక్రవారం సందర్శించారు ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ తీరు, ప్రగతి ఇతర అంశాలను ప్రధానోపాధ్యాయిని టి.పుష్పావతి ఎంపిడిఒకు వివరించారు. మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర అంశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ బాలికలకు ప్రత్యేకించిన మరుగుదొడ్ల వద్ద వాడేసిన సానిటరీ నాప్కిన్స్ వేసేందుకు లోపలే తొట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. వాటిని దగ్ధం చేసేందుకు ప్రత్యేకించిన విద్యుత్ పరికరాలు పాడైన కారణంగా వాటి నిల్వలు పేరుకుపోయినట్లు గుర్తించి పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రాతిపదికన ఒక విద్యుత్ పరికరాన్ని అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలకు గతంలో దాతలు అందజేసిన ఆర్ఒ ప్లాంట్ పాడై ఐదు సంవత్సరాలు దాటినప్పటికీ తిరిగి ఏర్పాటు చేయని కారణంగా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందటం లేదన్నారు. నాబార్డు సహకారంతో మంజూరైన ఆర్ఒ ప్లాంట్‌ను త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. నైట్ వాచ్‌మెన్ లేనందువల్ల పాఠశాల ఆవరణలో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటి నిరోధానికి రాత్రి సమయంలో గస్తీ ఏర్పాటు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సామ్యవాద ప్రేమికుడు కొత్తలంక రామబ్రహ్మం

నేడు సంస్మరణ సందర్భంగా

1948 నుంచి 1952 వరకు సాగిన వీర తెలంగాణ ప్రజా పోరాటం సందర్భంగా ఎందరో యువకిశోరాలు కమ్యూనిస్టు పార్టీ కోసం కొరియర్‌గా పని చేసి నేతలను కాపాడుకున్నారు. వారిలో ఒకరు పాలకొల్లు మండలం కాపవరానికి చెందిన కొత్తలంక రామబ్రహ్మం. చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు పార్టీ సేవలకు, ఆశయాలకు ఆకర్షితులై అత్యంత గడ్డు రోజుల్లో ప్రాణాలకు తెగించి, పార్టీ కోసం చురుగ్గా పని చేశారు.

నరసాపురం తాలుకా బ్రిటీష్ కాలంలోనే సాతంత్రోద్యమం బలంగా సాగిన ప్రాంతం. పాలకొల్లు, జిన్నూరు, పోడూరు, కవిటం, కాపవరం, వాలమర్రు, కొమ్ముచిక్కాల, పోలవరం, అరటకట్ల, భగ్గేశ్వరం, లంకలకోడేరు, చింతపర్రు, దగ్గులూరు తదితర గ్రామాలన్నీ స్వాతంత్ర సాధనకు సాగిన పోరాటంలో ముందున్నాయి. అనంతరం సమ సమాజం, శ్రమజీవుల హక్కుల కోసం పోరు సల్పాయి. ఆ ప్రాంత నాయకునిగా పార్టీ అభివృద్ధే తన జీవిత పరమార్థంగా అత్యున్నత చైతన్యంతో రామబ్రహ్మం ముందుకు సాగారు. శ్రామికజనావాళికి ఆత్మబంధువు.. రామబ్రహ్మం. ఆయన జీవిత యానం నేటి తరానికి మార్గదర్శకం. వెయ్యి కళ్లతో ఎక్కడ, ఎవరికి ఏ కష్టమొచ్చినా కని పెట్టుకుని ఉంటూ వారిని ఆదుకునేవారు. విరామం, విశ్రాంతి ఎరుగని జీవితంతో ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఇంటి దగ్గర స్వర్ణకారునిగా ఆగ్రామంలోని ప్రజలకు చిన్న చిన్న బంగారు నగలు చేస్తూ కుటుంబ పోషణ సాగించే వారు. మరోపక్క పార్టీ కార్యక్రమాల బాధ్యత. వెన్నుకు సంబంధించి తీవ్ర సమస్యతో పార్టీ జోక్యంతో శస్త్రచికిత్స చేయించుకుని కోలుకున్నారు. అనంతరం భార్య రామాయమ్మ సహాయంతో చిన్నచిన్న బంగారపు నగలు చేసేవారు. కొన్నాళ్లకు నెమ్మదిగా సైకిల్‌పై పాలకొల్లు పార్టీ ఆఫీసుకు వచ్చి కార్యక్రమాలు తెలుసుకునేవారు. ఈ నెల ఏడో తేదీన వయోభారంతో కన్నుమూశారు.

రామబ్రహ్మం రామాయమ్మ దంపతులకు ఐదుగురు బిడ్డలు. ముగ్గురు కుమారులు. ఇద్దరు కుమార్తెలు. కుటుంబమంతా తల్లిదండ్రుల వారసత్వంతో ప్రజా ఉద్యమాలను అభిమానిస్తూ అభ్యుదయవాదులుగా, ఆదర్శ శ్రామికులుగా జీవిస్తున్నారు. శ్రామికరాజ్యం, సమసమాజం స్థాపనకు శ్రమజీవుల సౌభాగ్యం కోసం నిరంతర కృషే రామబ్రహ్మం, రామాయమ్మలకు ఘన నివాళి.

- అల్లూరి మన్మోహిని

ఆదర్శ ప్రజా నాయకుడు రామబ్రహ్మం

పార్టీపై నిర్బంధకాలంలో నాయకులను, పార్టీ రహస్యాలను కాపాడటంలో, పార్టీ నిర్ణయాలను, సమాచారాన్ని ఇతర ప్రాంతాలకు క్షేమంగా చేరవేయడానికి ప్రాణాలకు తెగించి ధైర్యంగా కొరియర్‌గా పని చేసిన ధీరుడు రామబ్రహ్మం. వ్యవసాయ కార్మిక ఉద్యమ నాయకునిగా, సిపిఎం నాయకునిగా ప్రజల మన్ననలు పొందిన ఆదర్శ ప్రజా నాయకులు. సాధారణ కుటుంబమైనా తనకు వస్తున్నా వృద్ధాప్య పెన్షన్ నుంచి ప్రతినెలా పార్టీకి రూ.500 విరాళంగా అందించి అంకితభావం ప్రదర్శించిన త్యాగశీలి. భార్య రామాయమ్మ కూడా పార్టీ సభ్యురాలిగా, మహిళా సంఘం కార్యకర్తగా పార్టీ కార్యకర్తలను, నాయకులను ఎంతగానో అభిమానించి ఆదరించేవారు. రామబ్రహ్మంకు విప్లవ జోహార్లు.

- బి.బలరాం,
సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి

ఏ కార్యక్రమానికైనా సైకిల్‌పైనే..

రామబ్రహ్మం స్వగ్రామం కాపవరం నుండి పాలకొల్లు ఏకార్యక్రమానికైనా సైకిల్‌పైనే రాకపోకలు సాగించేవారు. మహిళాసంఘం కార్యక్రమాలకు ఆయన భార్య రామాయమ్మ రావాలంటే తనకున్న చిన్న మోపెడ్‌పై తీసుకొచ్చేవారు. చాలా సందర్భాల్లో ఒంటరిగానే పార్టీ, సంఘం ఇచ్చిన బాధ్యతలను పట్టుదలగా సైనికునిలా పని చేసేవారు. కూలిరేట్ల ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. అప్పుడు ఆయన ఆనందం పట్టలేకపోయారు. జిల్లా ఉద్యమ నిర్మాత ఉద్దరాజు రామం స్వగ్రామం వాలమర్రు, ఈయన గ్రామం కాపవరం పక్కపక్కనే కావడం విశేషం. గ్రామంలో ఈయన సామాజిక తరగతి ప్రజలు తక్కువ మందైనా కమ్యూనిస్టుగా, వ్యవసాయకార్మిక సంఘం నాయకునిగా ప్రజా సమస్యలపై పనిచేసే నాయకునిగా అందరి హృదయాల్లోనూ నిలిచారు. అత్యంతసౌమ్యునిగా మృదుభాషిగా పేరొందారు. ఎంతటి వారికైనా మరణం అనివార్యం.. అయితే ఆశయాలు మాత్రం అజరామరం. రామబ్రహ్మం జీవితం అందుకు తార్కాణం.

- ఎ.రవి,
సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి

విష్ణు ఇంజినీరింగ్ కళాశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ విష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యలో ఉన్నత ప్రమాణాలు సాధించినందుకుగాను ఇంజి నీరింగ్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేశారని కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవార్డును చెన్నయ్‌లోని ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) నిర్వహించిన 37వ ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్‌లో తమిళనాడు విద్యాశాఖా మంత్రి అన్బిల్ మహేష్ పోయమొళి చేతులమీదుగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరాజు, డీన్ వివిఆర్.మహేశ్వరరావు సంయుక్తంగా అందుకున్నారు.

అవార్డు అందుకుంటున్న కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్

సూరిబాబుకు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫైర్ సర్వీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగంలో మండలానికి చెందిన హోంగార్డు కె.సూరిబాబు నాలుగు పతకాలు కైవసం చేసుకున్నారు. విజయవాడలో జరిగిన క్రీడా పోటీల్లో మూడు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ డిజిపి సంజయ్‌కుమార్ చేతులమీదుగా ఈ పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా సూరిబాబును పలువురు మండల అధికారులు అభినందించారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ తులసి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అంగన్‌వాడీ, హెల్త్‌వర్కర్స్, మహిళా పోలీసులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, పిల్లలు రక్తహీనతతో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఆరోగ్య సిబ్బంది అటువంటి వారిపై శ్రద్ధ చూపాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సరైన రీతిలో పోషకాహారం పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.మంగతాయారు, సూపర్‌వైజర్లు లక్ష్మీకుమారి, వెంకాయమ్మ, శాస్త్రి, మహిళాపోలీస్, ఎఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

భోజనం రుచి చూస్తున్న తహశీల్దార్

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పాటించటంతో పాటు హాజరు శాతానికి తగ్గట్లుగా భోజనం తయారు చేయాలని ఆగిరిపల్లి తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు ఆదేశించారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు పి.పుష్పలత, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏరియా ఆసుపత్రిలో సదరం సేవలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అందించే సదరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. ఇటీవల ఆసుపత్రిలో అందించే సదరం సేవలు వైద్యులు బదిలీ అవ్వడం వల్ల తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. ఇక నుంచి సదరం సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు ప్రతి మంగళవారం, శుక్రవారం ఆసుపత్రికి రావాలని తెలిపారు.

గ్రేస్ మందిర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



జీలుగుమిలిల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

క్రీస్తు పుట్టుక సమస్త మానవాళికి రక్షణకారమని పాస్టర్ బి.ఎజ్రాశాస్త్రి అన్నారు. స్థానిక గ్రేస్ మందిర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఏలూరు మన్నా చర్చ్ అధినేత పాస్టర్ జ్యోతిరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎజ్రాశాస్త్రి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీస్తు మార్గంలో శాంతియుతంగా నడవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా క్రీస్తు జన్మదిన వేడు కలు జరుపుకుంటున్నారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నిర్మలశాస్త్రి, ఎస్.వేణి, ప్రశాంతి, జ్యోతి, కృపజ్యోతి, ఎస్.రాఘవులు, పి.డేవిడ్‌రాజు, కె.టోనీ, మూర్తి, శివ, వంశీ, గంగాధరరావు, అశోక్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ :రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పత్తేబాదలోని రెడ్ క్రాస్ ఎఎన్ఎం నర్సింగ్ మహిళా కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎం మహిళా కళాశాల ఛైర్‌పర్సన్ బొమ్మారెడ్డి పద్మజవాణి మాట్లాడారు. రాజకుమారి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పెన్నుల, పుస్తకాలు, ఆట వస్తువులు, హైజిన్ కిట్లను పంపిణీ చేశారు.

నేరాలు - ఘోరాలు

హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

వరకట్నం కోసం భార్యను వేధించి హత్య చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు కైకలూరు రూరల్ సిఐ నాయుడు తెలిపారు. శుక్రవారం ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఎస్ఐ షణ్ముఖసాయితో కలిసి వివరాలు వెల్లడించారు. మండలంలోని వడాలికి చెందిన త్రివేణికి మండలంలోని ఉప్పరగూడేనికి చెందిన రెడ్డి శివశంకర్‌తో వివాహమైంది. వీరికి జతీశ్వర్ అనే నెల బాబు ఉన్నాడు. కొంతకాలంగా త్రివేణి భర్త, అత్త, మామలు అధిక కట్నం కోసం వేధిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ రాత్రి వీరి మధ్య జరిగిన గొడవలో భర్త శివశంకర్, మామ రెడ్డి రంగారావు, అత్త రెడ్డి ఈశ్వరమ్మ త్రివేణిని కొట్టి గాయపరచి, తర్వాత ఆమె గొంతు నులిమి శ్వాస ఆడకుండా చంపినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. మృతురాలి తల్లి ఆదిరెడ్డి జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి కైకలూరు కోర్టుకు హాజరు పరిచినట్లు సిఐ నాయుడు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని గోపన్నపాలెం పరిధిలో సెట్టి నాగరాజు నిమ్మతోటలో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంది. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మతోట రైతు నాగరాజు శుక్రవారం ఉదయం తోటలోకి వెళ్లగా అక్కడ మహిళ మృతదేహం ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని తెలిపారు. పోలీసులు మహిళ మరణం స్థలంలో పురుగుల మందు డబ్బాను గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతురాలిని గుర్తు పట్టినవారు దెందులూరు పోలీసులకు 9440796654 సమాచారం అందించాలని ఎస్ఐ ఇబ్బాపు వీర్రాజు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రొయ్యల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇటీవల కాలంలో మండలంలోని రొయ్యలు దొంగతనాలకు పాల్పడిన రొయ్యల దొంగను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు కైకలూరు సిఐ నాయుడు తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 28వ తేదీ మండలంలోని పెదగొన్నూరుకు చెందిన రైతు శ్రవణం నాగేశ్వరప్రసాద్‌కు చెందిన చెరువులో రూ.లక్ష విలువైన రొయ్యలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని నాగేశ్వరప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నేరం జరిగిన ప్రాంతంలో సీసీ టివి ఫుటేజీ సేకరించి నేరానికి ఉపయోగించిన వాహన ఆధారాలను సేకరించి సిబ్బంది సహాయంతో నిఘా పెట్టారు. గత నెల 21వ తేదీ నేరం చేయడానికి వచ్చిన రొయ్యల దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించగా వారిలో ప్రధాన నిందితుడు చలంచర్ల హనుమంతు పట్టుబడగా మరో ఇద్దరు పరారైనట్లు పోలీసులు తెలిపారు. హనుమంతు నుంచి రెండు బొలెరో వాహనాలు, పల్సర్ బైక్, రూ.55 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని గురుభట్లగూడెంలో విజిలెన్స్ అధికారులు రేషన్‌బియ్యం పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. గురుభట్లగూడెంలో శుక్రవారం దాడి చేసిన విజిలెన్స్ అధికారులు 24 బస్తాల (1650 కేజీలు) రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రావుపల్లి గ్రామానికి చెందిన రవి గురుభట్లగూడెంలో అక్రమంగా బియ్యం నిల్వ ఉంచారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పర్యావరణ హితమే ధ్యేయం

ఆర్‌డిఒ పెంచల కిషోర్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెంచల్ కిషోర్, వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

పర్యావరణ హితమే ధ్యేయంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఫ్లెక్సీలపై నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పర్యావరణ, అవగాహన కార్యచరణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (నిషేధిత జాబిత), ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేదం ప్రభుత్వ ఆదేశాలు, జరిమానాలు తదితర అంశాలతో ప్రజల అవగాహన కోసం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమం బుర్రకథ దళం నిర్వహించింది. ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ కె.పెంచల కిషోర్ మాట్లాడుతూ పర్యావరణానికి ఎంతో నష్టం కలిగిస్తూ మనకు మనమే చేటు తెచ్చుకుంటున్నామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధంపై ప్రభుత్వ మార్గదర్శకాలను గ్రామ స్థాయి వరకు తీసుకువెళ్లడంలో అధికారిగానే కాకుండా ఒక పౌరుడిగా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు. ప్లాస్టిక్ బ్యానర్లు, తయారు చేసే యజమానులు సాంకేతికతను అందిపుచ్చుకొని క్లాత్ బ్యానర్ల తయారీపై దృష్టి పెట్టాలన్నారు. అమరావతికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ కెమికల్స్ ప్రతినిధి డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనార్థాలను తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ బ్యానర్ల వినియోగంపై పటిష్టమైన నియంత్రణ అవసరమన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం పి.ఏసుదాసు మాట్లాడుతూ క్లాత్ బ్యానర్ల క్లస్టర్ ఏర్పాటుకు ప్రింటింగ్ యూనిట్లను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒలు, డివిజనల్ స్థాయి పంచాయితీ అధికారులు, ఇఒపిఆర్‌డిలు పాల్గొన్నారు.

కైకరంలో చెరువు నీరు కలుషితం

దుర్వాసనతో గ్రామస్తుల ఇబ్బందులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రంగు మారిన నీళ్లతో కైకరం చెరువు

కైకరం పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న రెండు చెరువుల్లో ఓ చెరువులో నీరు రంగుమారి దుర్వాసన వస్తోందని పలువురు వాపోతున్నారు. గ్రామానికి తాగునీటి కోసం భూగర్భ జలాలను ఒహెచ్‌ఆర్ ట్యాంకు సాయంతో సరఫరా చేస్తున్నారు. దీంతో చెరువు నిరుపయోగంగా మారింది. అంతేకాకుండా చెరువులోకి పలు వ్యర్థాలు కలుస్తున్నాయని, చెరువు గట్టును తాకేలా నీరు నిండుగా ఉంది. మురుగునీరు బయటికి వెళ్లేమార్గం లేదు. దీంతో నీరు రంగు మారి దుర్వాసన వస్తోందని చెరువు చుట్టూ పారిశుధ్యం అధ్వానంగా ఉందని తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెరువు పక్కనే అంగన్‌వాడీ కేంద్రం, పశువుల ఆసుపత్రి ఉన్నాయి. సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారిస్తామని పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ చెప్పారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంపు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు తెలిపారు. ఈ ఉత్తర్వులను అనుసరించి జనవరి 2022 నుంచి ప్రస్తుతం వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు.

21న పరిశ్రమల స్థాపనపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించేందుకు, జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అమలవుతున్న పథకాల గురించి వివరించేందుకు ఈ నెల 21న ఉదయం 11 గంటలకు జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా స్థాయి ఇడిపి (ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి పి.ఏసుదాసు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

వంగవీటి రాధాను కలిసిన కాపు నేతలు

టి.నరసాపురం :వంగవీటి రాధాకృష్ణను విజయవాడలోని ఆయన స్వగృహంలో మండల కాపు నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో ఈ నెల 21వ తేదీన జరగనున్న కీర్తిశేషులు వంగవీటి మోహన్‌రంగా విగ్రహ ప్రారంభోత్సవానికి రంగా తనయుడు రాధాకృష్ణను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల కాపు నేతలు మాట్లాడుతూ మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం, అప్పలరాజుగూడెం, గంగినీడుపాలెం, రుద్రకోటరాజుగూడెం గ్రామాల్లో నూతనంగా వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాల్నీడి రమేష్, దాకారపు సూరిబాబు, నోముల సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

సాగునీరు, పంటల ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని బుట్టాయగూడెం గ్రామ పంచాయతీలో సేవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుబ్బసగుంట చెరువు ఆయకట్టుదారులకు పంట నీరు ప్రణాళిక కార్యక్రమంపై శుక్రవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భూగర్భ జలం, జల గణన శాఖ డిప్యూటీ డైరెక్టర్ విపిఎస్.విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఖరీఫ్ పంట పూర్తికాగానే రబీ పంటలు ప్రారంభ సమయంలో నవంబర్ నెల మొదట్లో నీటి ప్రణాళిక తయారు చేసుకోవాలని చెప్పారు. ముందుగా చెరువుకు సంబంధించిన ప్రణాళిక తయారు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్, సేవ ఆర్గనైజేషన్ టీమ్ లీడర్ డి.సత్యనారాయణ, సర్పంచి తెల్లం వెంకాయమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ కార్యదర్శి తెల్లం సూరిబాబు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు రెడ్డినాయుడు పాల్గొన్నారు.

విద్యాదాత మూర్తిరాజు

ప్రజాశక్తి - గణపవరం



మూర్తిరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న లెక్చరర్లు

విద్యార్థులకు విద్య అందించడానికి జిల్లాలో 67 విద్యాలయాలు నిర్మించిన విద్యాదాత మాజీ మంత్రి చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద్ మూర్తిరాజు అని గణపవరం జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎం.రఘు అన్నారు. మూర్తిరాజు జయంతిని కాలేజీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రఘు మాట్లాడుతూ భూదాన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని తనకు ఉన్న 1800 ఎకరాలను దానం చేసిన మహోన్నత వ్యక్తి మూర్తిరాజు అని కొనియాడారు. గాంధీజీ ఆశయాలను ప్రజలకు తెలియచెప్పడానికి వీలుగా పెదనిండ్రకొలనులో గాంధీ భవనం నిర్మించారన్నారు. కొల్లేరు భూములను సాగులో తెచ్చి కొల్లేరు రాజుగా పేరుపొందిన వ్యక్తి అని అన్నారు. మూర్తి రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కాశిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ లో జరుగుతున్న నాడు నేడు పనులను శుక్రవారం గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయానికి రూ.51 వేల విరాళం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నూకాలమ్మ ఆలయానికి దాతలు రూ.51,116లు విరాళంగా అందించారని ఆలయ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం భద్రాచలం సత్యనారాయణ దంపతులు, కుటుంబసభ్యులు విరాళం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

దళితుల సమరభేరి ర్యాలీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో శనివారం నిర్వహించే దళితుల సమరభేరి ర్యాలీని జయప్రదం చేయాలని టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పిలుపునిచ్చారు. స్థానిక బడేటి చంటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ముఖ్యమంత్రి జగన్ కాలరాస్తున్నారన్నారు. దళితుల సమరభేరి ర్యాలీకి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టిడిపి పూర్తి సంఘీభావం ప్రకటించి ప్రత్యక్షంగా పాల్గొంటుందన్నారు. ఈ నెల 17న నగరంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి మధ్యాహ్నం రెండు గంటల నుంచి టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నుంచి ఫ్లైఓవర్, జ్యూట్‌మిల్, వసంత మహల్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వద్ద బిఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ, నగర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జుజు మోజెస్, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.

'బిసిలకు వైసిపి చేసింది శూన్యం'

ప్రజాశక్తి - ముసునూరు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బిసిలకు చేసిందేమీ లేదని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని లోపూడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 56 బిసి కార్పొరేషన్ల పదవులు రెండేళ్ల పూర్తవ్వడంతో ముగిసిపోయాయని, సంబంధిత కార్పొరేషన్ ఛైర్మన్లలో ఒక్కరికైనా న్యాయం చేశారా అని ప్రశ్నించారు. ఈ మూడేళ్ల కాలంలో బిసి కార్పొరేషన్ రుణాలు ఏం అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, డి.రాంబాబు, ఎస్.నూతన్‌కుమార్, సిహెచ్.వెంకటేశ్వరరావు, కాంతారావు, చెన్నారావు, పాకనాటి సీతారామ్, భద్రయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

యువజన మాసోత్సవాల క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని సర్పంచి ముప్పిడి విజయ్‌కుమారి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కొయ్యలగూడెం రోటరీ క్లబ్ 3020 ఆధ్వర్యంలో శుక్రవారం యువజన మాసోత్సవాలు నిర్వహించారు. పది రోజులు పోటీలను నిర్వహించనున్నట్లు రోటరీ అధ్యక్షులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మద్దు గోపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ సంకు కొండ, బోనగిరి పాపారావు, తోట వెంకటేశ్వర్లు, చిరువూరి సాయి, మజ్జి సూరిబాబు, ఐవి అప్పారావు, దారం సత్తిరాజు, యాతం సత్యనారాయణ, ఏడుకొండలు, రొటీరియన్స్, స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.

ఘనంగా దాకారపు కృష్ణ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక రోటరీ అధ్యక్షులు దాకారపు కృష్ణ పుట్టినరోజు వేడుకలను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోటరీ కార్యదర్శి రాంగోపాల్(గోపి) ఆధ్వర్యంలో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణ పుట్టినరోజు సందర్భంగా వ్యక్తిగత వితరణతో రోటరీ షటిల్ కోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీదామోదరం సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్ అందించారు. ప్రతిభ చూపిన ఇంటర్ విద్యార్థులకు ప్రిన్సిపల్ బి.వెంకటేశ్వరరావు సమక్షంలో రోటరీ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రోటరీ చార్టర్ కార్యదర్శి మల్లాది సీతా రామారావు(ఎంఎస్ఆర్) వితరణతో కంప్యూటర్ అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న చల్లా సుబ్రహ్మణ్యరమేష్ ఇంటికి వెళ్లి వీల్ చైర్, బియ్యం, నిత్యావసరాలు, రెండు నెలలకు సరిపడా మందులు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాపోలు భావనఋషి, వ్యాపారవేత్తలు, వైద్యులు, సంస్థలు, మిత్రులు దాకారపు కృష్ణను అభినందిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాకారపు చంద్రరావు, దాకారపు నరసింహమూర్తి, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం



సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్, ఎఒ

మండలంలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సిబ్బందిని గణపవరం తహశీల్దార్ సన్యాసిరావు, వ్యవసాయ అధికారి వై.ప్రసాద్ ఆదేశించారు. మండలంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను, రైస్ మిల్లులను వారు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వల్లూరు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు తక్కువగా ఉందని, వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం సిబ్బంది 1318కి రకానికి సంబంధించిన అన్ని రకాలైన నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలన్నారు. ఒక శాతం లోపు ఉంటేనే ధాన్యాన్ని రైస్ మిల్లుకు పంపించాలన్నారు. లేకపోతే మళ్లీ పోత పోసి తీసుకురావాలని, రైతులకు చెప్పాలని సూచించారు. ధాన్యం నమూనా సేకరించినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి -ముసునూరు

మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండలంలోని చింతలవల్లి ఎంపిపి పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో ఆయన శుక్రవానం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని సూచించారు.

చింతలపూడి : విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తహశీల్దార్ కృష్ణజ్యోతి అన్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీలోని వెంకంపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు.

సరైన ప్రణాళికతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మాట్లాడుతున్న ఎంపిపి సత్యనారాయణ

సరైన ప్రణాళికలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని, అందుకోసం నిర్వహిస్తున్న శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల నుంచి విడుదలైన నిధులు, వాటి ద్వారా చేపట్టే పనులపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీవ నియంత్రణ ఎరువులపై శిక్షణ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి డివిజన్ పరిధిలో చింతలపూడి, టి.నరసాపురం, లింగపాలెం మండలాల్లో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బందికి జీవ నియంత్రణ ఎరువులపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ జోనల్ కోఆర్డినేటర్ పి.హుస్సేన్ మాట్లాడుతూ రైతాంగంలోకి బయో కల్చర్స్ తీసుకువెళ్లాలని సిబ్బందికి సూచించారు. బయోకల్చర్స్ తయారు చేసే విధానం, ఉపయోగాలు వివరించారు. బయో కల్చర్స్ మొత్తం 23 రకాలని చెప్పారు. ప్రస్తుతం ఎరువులు, పురుగుమందులకు బదులుగా ఈ కల్చర్స్‌ని వినియోగించుకోవచ్చని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందవచ్చన్నారు. ఈ కల్చర్ తయారైన తర్వాత గ్రామంలో ఉన్న మొక్కజొన్న, వరి రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు, ఏలూరు జిల్లా

E.P. 12/2021 in O.S. 34/2019

Between:

శ్రీ ఏనుగు వెంకట చైతన్యకుమార్ -డి. హెచ్. ఆర్

మరియు

శ్రీ ఆకుల కృష్ణమోహన్ -జె. డి. ఆర్.

పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం దిగువ తెలిపిన JDR నకు చెందిన షెడ్యూలు స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట **ది. 05-01-2023వ తేదీ ఉదయం 10.30 ని॥** లగాయతు బహిరంగ వేలం వేయుదురు. కావున సదరు వేలంలో పాల్గొనదలచినవారు వారి యొక్క ఒరిజినల్ ఆధార్ కార్డులతో వేలం తేదీ ఉదయం 10.30 గం॥లకు హాజరవ్వగలరు.

షెడ్యూలు ఆస్తి వివరము

పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రారు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, దక్షిణపు వీధిలో గల డోర్ నెం. 6ఎ-9-42 గా గల 100-00 చ॥గ॥లో ఉన్నటువంటి రెండు అంతస్తుల డాబా ఇల్లుకు హద్దులు.

తూర్పు: ఆకుల వీరవెంకట సత్యవతి గారి స్థలం.
దక్షిణం: సూరే హనుమంతరావు గారి స్థలం.
పడమర: రోడ్డు. **ఉత్తరం:** రోడ్డు.

DHR Value: Rs. 35,00,000/-

Ameena Value: Rs. 45,00,000/-

K.J.VIVASWANTA
Advocate, Eluru

వేలం ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 55/2016 in O.S.No. 125/2010

Between:

సత్తి రామారెడ్డి ...D.H.R

మరియు

మరడాని గోపాల కృష్ణ (డైడ్) అండ్ అదర్స్ ...J.D.R's

పైనెంబరు గల గ్రంధములో D.H.R. గారి డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈదిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని పై కోర్టు వారి సమక్షంలో బహిరంగముగా **ది.06-01-2023 తేదీన ఉదయం గం॥ 10:30 లగాయితూ వేలం వేయబడును.** కావలసిన వారు పాడుకొన వచ్చును. ఇ.సి. లావాదేవీలను అనుసరించి కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం.

SCHEDULE

A-Schedule (1st Item):

West Godavari District, Tadepalligudem Sub Registrar, and Tadepalligudem Municipality, Old 10th Ward present election ward 7th ward, 4th block, Tadepalligudem Town B.S.No. 111, Old Assessment No. 3341, New Assessment No. 1080000006 and D.No. 4-37-3/1,2 having extent of Sq. 204 yards in which western side 142 Sq. Yards, electrical service, water tap with all fixtures andexed the site including all easementary rights annexed to the above building with in the following boundaries: ***East:*** 56 (feet)-3 (inches) in which "B" Schedule No.1 of Plot. ***South:*** 22 (feet)-6 (inches) relating Devineni Sita Mahalaxmi site. ***West:*** 57 (feet)-3 (inches) Houses of Maradani Savitri. ***North:*** 22 (feet)-6 (inches) relating to Akkisetti Srinivasarao's site.

With in the above boundaries with all mines and minerals and easement rights etc., etc,

A-Schedule (2nd Item):

Ground Fkloor, 1st Floor & 2nd Floor constructed R.C.C. Building with Two pupations under ground floor as explained in to 1 item in A-Scheduled in respect of locations and other numbers etc., within these boundaries out of 142 Sq. yards site. ***East:*** 1st Item in B-Schedule. ***South:*** Site of Devineni Sita mahalaxmi. ***West:*** Houses of Msradani Savitri. ***North:*** Akkisetti Srinivasa rao's site.

With in the above boundaries an extent of 850 Sq. feet with two protions in ground floor with all electrical service no. 4838, water tap with all fixtures all easement rights annexed to the above building.

B-Schedule (1st Item):

West Godavari District, Tadepalligudem Sub Registrar, and Tadepalligudem Municipality, Old 10th Ward present election ward 7th ward, 4th block, Tadepalligudem Town B.S.No. 111, Old Assessment No. 3341, New Assessment No. 1080000006 and D.No. 4-37-3/1,2 having extent of Sq. 204 yards in which estern side 62 Sq. Yards, site in total extent 204 Sq. Yards, electrical service, water tap with all fixtures andexed the site including all easementary rights annexed to the above building with in the following boundaries: ***East:*** Municipall Road. ***South:*** Site of Devineni Sita Maha Lakshmi. ***West:*** 1st Item of site relating to A-Schedule. ***North:*** Coupond wall of Akkisetti Srinivasarao.

With in these boundaries 2/3 out of 62 Sq Yards site with all easement rights.

B-Schedule (2nd Item):

2-A) For the building under ground floor in the extent of 210 Sq. feet the boundaries are given below:

East: Open Free. ***South:*** -ditto-
West: -ditto- ***North:*** -ditto-

Within these boundaries with ad fixtures annexed the site including all easement rights annexed to the above building.

2-B) For the building under 2nd floor in the extent of 210 Sq. feet the boundaries are given below:

East: Open Free. ***South:*** -ditto-
West: -ditto- ***North:*** -ditto-

Within these boundaries with ad fixtures annexed the site including all easement rights annexed to the above building.

D.H.R. Value : Rs.7,00,000/-
Ammina Value : Rs.12,00,000/-

తోట వెంకటసత్యనారాయణ
తోట జగదీష్ కుమార్
అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం
సెల్: 99482 43686

తాడేపల్లిగూడెం,
16-12-22.